సాక్షి
వికారాబాద్

శుక్రవారం : 12 : జనవరి : 2024



వివేకానందుడి బోధనలు..

దేశ ప్రయోజనాల కోసం యువత కృషి చేయాలని శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ సూచించారు. 8లో▸



సమస్యలపై చిత్తశుద్ధి ఏదీ?

ప్రజా సమస్యలపై చర్చించాల్సిన నవాబుపేట మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. 9లో▸



ఊరడమ్మ తల్లికి బోనాలు

పెద్దేముల్ మండలం నాగులపల్లి, తట్టెపల్లి గ్రామాల్లో ఊరడమ్మజాతరను ఘనంగా నిర్వహించారు. 9లో▸

న్యూస్‌రీల్

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో 2024 – 25 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు డీఈఓ రేణుకాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్లు పొందేందుకు విద్యార్థులు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 12నుంచి 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఏప్రిల్ 7వ తేదీ ఉదయం 10 నుంచి 12గంటల వరకు 6వ తరగతి విద్యార్థులకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4గంటల వరకు 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

ఓటరు నమోదుకు సిద్ధం కండి

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

కొడంగల్ రూరల్: కొత్త ఓటర్ల నమోదుకు సిద్ధం కావాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ఎన్నికల సిబ్బందికి సూచించారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన వారు విధిగా ఓటు హక్కు పొందాలన్నారు. కొత్తగా ఓటు హక్కు పొందేందుకు ఈ నెల 20, 21వ తేదీల్లో దరఖాస్తు చేసుకువాలన్నారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నందున ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఓటరు నమోదు ప్రక్రియను అధికారులు, నాయకులు బాధ్యతాయుతంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.విజయకుమార్, డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్, రెవెన్యూ సిబ్బంది, ఆయా పార్టీల నాయకులు ముస్తాక్, ఎస్‌బీ గుల్షన్, మాజీ సర్పంచు రమేష్‌బాబు, బషీర్, కె.చంద్రప్ప, శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వంట గ్యాస్ సరఫరా

వికారాబాద్ అర్బన్: పట్టణంలోని గ్యాస్ వినియోగదారులకు శుక్రవారం నుంచి బుకింగ్ ప్రకారం గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్యాస్ కొరత కారణంగా రెండు రోజుల నుంచి స్థానిక అంబిక గ్యాస్ ఏజెన్సీ వద్ద వినియోగదారులు క్యూ కట్టారని పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకొని సంబంధిత హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ సేల్స్ అధికారులతో సంప్రదించినట్లు తెలిపారు. గ్యాస్ ప్లాంట్‌లో సాంకేతిక సమస్యల వల్ల తాత్కాలిక అంతరాయం ఏర్పడిందని, నేటి నుంచి యథావిధిగా సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.



వికారాబాద్‌లో వెలిసిన ప్రత్యేక దుకాణాలు

పతంగి పండుగొచ్చింది

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని వికారాబాద్‌లో పతంగుల దుకాణాలు వెలిశాయి. రకరకాల గాలిపటాలు, మాంజాలు మార్కెట్‌లోకి వచ్చాయి. ఒక్కో పతంగి ధర రూ. 2 నుంచి రూ. 100 వరకు ఉంది. మాంజా ధర రూ.10 నుంచి రూ.150 వరకు ఉంది. ప్రధాని మోదీ పతంగులు ఆకర్షణగా నిలుస్తున్నాయి. నేటి నుంచి స్కూళ్లు, కళాశాలకు సెలవులు ఉండటంతో విద్యార్థులు, యువకులు పతంగులు ఎగురవేసేందుకు సిద్ధమవుతున్నారు.

– అనంతగిరి



విక్రయానికి సిద్ధంగా ఉన్న రకరకాల పతంగులు



మాట్లాడుతున్న సునీతారెడ్డి.(చిత్రంలో) స్పీకర్ ప్రసాద్ కుమార్, కలెక్టర్ నారాయణరెడ్డి

డీఆర్డీఏలో అక్రమాలపై దుమారం

వాడీవేడిగా జెడ్పీ సర్వసభ్య సమావేశం

- 'సాక్షి' కథనాన్ని ప్రస్తావించిన జెడ్పీ వైస్ చైర్మన్
- డీపీఎం అక్రమాలపై సిగ్గు పడుతున్నామన్న డీఆర్డీఓ
- బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టాలి: తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- డీపీఎంపై సస్పెన్షన్ వేటు. విధుల నుంచి వీఓఏ తొలగింపు

వికారాబాద్:జిల్లా పరిషత్ జనరల్ బాడీ సమావేశం గురువారం చైర్‌పర్సన్ సునీతారెడ్డి అధ్యక్షతన వాడీవేడిగా సాగింది.డీఆర్డీఏలో ఉద్యోగుల అక్రమాలు.. పనులకు సంబంధించి బిల్లులు చేయడంలో ఇంజనీరింగ్ విభాగం చేస్తున్న అలసత్వం.. విద్యుత్ శాఖ ఏఈల నిర్లక్ష్యం.. ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు.. అనుమతులు లేని కట్టడాలు..రైసు మిల్లుల్లో జరుగుతున్న అవకతవకలపై సభ్యుల మండిపడ్డారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా స్పీకర్ ప్రసాద్‌కుమార్, పరిగి,తాండూరు ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

అక్రమాలపై దుమారం

డీఆర్డీఏలో అవినీతి జలగలు శీర్షికన గురువారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై జనరల్ బాడీ సమావేశంలో దుమారం రేగింది. ముందుగా జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ ఈ విషయాన్ని సభలో లేవనెత్తారు. మహిళలు, మహిళా సంఘాల సభ్యుల పురోగతికి తోడ్పాటు నందిస్తూ వారి ఆర్థిక పరిపుష్టికి దోహదం చేయాల్సిన ఐకేపీ ఉద్యోగులే ఇలా సభ్యుల ఖాతాల్లోంచి సొమ్మును కాజేయడం ఏమిటని నిలదీశారు.మహిళా సంఘాల సభ్యులు ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహించడం ద్వారా వచ్చిన రూ.10 లక్షలను కాజేశారని తెలిపారు. ఇదే విషయంపై మాట్లాడిన తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.ఈ విషయంపై వివరణ ఇచ్చిన డీఆర్డీఓ కృష్ణన్ బొంరాస్‌పేట మండలం బురాన్‌పూర్ వీఓలో అక్రమాలు జరిగిన మాట వాస్తవమేనని తెలిపారు.ఓ డీపీఎం స్థాయి ఉద్యోగి ఇలా చేయడంపై సిగ్గు పడుతున్నామని తెలిపారు. అనంతరం స్పందించిన కలెక్టర్ నారాయణరెడ్డి ఈ విషయంపై పూర్తి స్థాయి విచారణకు ఆదేశిస్తున్నామని.. బాధ్యుడైన డీపీఎం వీరయ్యను సస్పెండ్ చేస్తున్నామని తెలిపారు. దీంతో దుమారం సద్దుమణిగింది.

సమస్యలపై నిలదీత

సర్వసభ్య సమావేశంలో సభ్యులతో పాటు ఎమ్మెల్యేలు అధికారుల తీరుపై మండిపడ్డారు. రైసు మిల్లుల్లో అవకతవకలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సభ్యులు మండిపడ్డారు. స్పందించిన కలెక్టర్ ఇప్పటికే టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో విచారణ చేయించామని, ఇంకా ఏమైనా అనుమానాలు ఉంటే ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో సభ్యులు శాంతించారు. మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పనులకు బిల్లులు రాకపోవడంపై కూడా సభ్యులు నిలదీశారు. పలు పాఠశాలల్లో మూత్రశాలలు లేవని సభ్యులు పేర్కొన్నారు. దీనిపై స్పీకర్ ప్రసాద్‌కుమార్ స్పందించారు. పాఠశాలలకు సంబంధించి ఎలాంటి అవసరాలు ఉన్నా ప్రతిపాదనలు పంపితే నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. కొందరు ప్రైవేటు వ్యక్తులు ఇష్టారాజ్యాంగా వెంచర్లు చేస్తూ ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండానే నిర్మాణాలు చేపడుతున్నారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరికొందరు ప్రభుత్వ భూములు, చెరువులు ఆక్రమించినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. చర్యలు తీసుకుంటామని కలెక్టర్, డీపీఓ తెలపడంతో సభ్యులు శాంతించారు. పలు అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు మంజూరు చేయడంలో ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సభ్యులు మండిపడ్డారు. స్పందించిన కలెక్టర్ వెంటనే బిల్లులు చేయాలని ఆదేశించారు. తర్వాలో సర్పంచుల పదవీ కాలం ముగియనున్నందున వారు చేసిన పనులకు సంబంధించి బిల్లులు వెంటనే చెల్లించాలని కలెక్టర్ ఆదేశించారు. బషీరాబాద్, కొడంగల్ పరిధిలోని కొన్ని గ్రామాల్లో అంతర్రాష్ట్ర సరిహద్దు సమస్య ఉందని, వేల ఎకరాల భూమి వివాదంలో పడటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని సభ్యులు తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తామని కలెక్టర్ తెలిపారు. విద్యుత్ శాఖ ఏఈలు రైతులు, వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. ఇకపై ఇలా జరగకుండా చూస్తామని ఎస్ఈ జయరామ్ హామీ ఇచ్చారు.

ఇద్దరిపై వేటు

బురాన్‌పూర్ ఐకేపీ సభ్యులకు చెందిన రూ. 10లక్షలు కాజేసిన డీపీఎం వీరయ్యపై సస్పెన్షన్ వేటు పడింది. ఆయన తోపాటు బురాన్‌పూర్ వీఓఏ నర్సింహులును విధుల నుంచి తొలగించారు. ఈ మేరకు గురువారం సాయంత్రం కలెక్టర్ నారాయణరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

అభివృద్ధికి పాటుపడుదాం: సునీతారెడ్డి

ఎన్నికల వరకే పార్టీలు.. ఇప్పుడు అందరి లక్ష్యం ఒక్కటే.. ప్రజల సమస్యలను పరిష్కరించడం.. సభ్యులందరూ పార్టీలను పక్కన పెట్టి జిల్లా అభివృద్ధికి పాటు పడుదామని జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. అధికారులు రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ సలహాలు, సూచనలు చేయాలన్నారు. పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. నిధుల కేటాయింపులో వెనకబడిన గ్రామాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రభుత్వ పనులకు ఇసుక అనుమతులు ఇవ్వాలని ఆమె కలెక్టర్‌కు సూచించారు. రేషన్ బియ్యం అవకతవకలను అరికట్టాలని, నాటిన ప్రతి మొక్క బతకాలని, చెట్ల నరికివేతను అరికట్టాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ జనకిరెడ్డి, డిప్యూటీ సీఈఓ సుభాషిణి, ఆయా శాఖల జిల్లా అధికారులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి

- స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం వికారాబాద్‌లోని డీపీఆర్‌సీలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా స్పీకర్, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి, నేను జిల్లా వాసులు కావడంతో ప్రజలు అభివృద్ధి, సంక్షేమంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని తెలిపారు. వారి ఆలోచనలకు అనుగుణంగా పని చేస్తామని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధిలో అధికారుల పాత్ర ఎంతో ముఖ్యమని, సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గత ప్రభుత్వం మన ఊరు – మన బడి పనుల బిల్లులు చెల్లించ లేదని, వెంటనే మంజూరయ్యేలా చూస్తామన్నారు. విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తామన్నారు. జిల్లాలో పరిశ్రమలు నెలకొల్పితే 2లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. చేవెళ్ల – ప్రాణహిత, పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలు పూర్తి చేసి సాగు, తాగు నీరు అందిస్తాని తెలిపారు. రూ. 200 కోట్లతో అనంతగిరి గుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. అలాగే కోట్‌పల్లి, జుంటుపల్లి, సర్పన్‌పల్లి ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. జెడ్పీ భవన నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ, జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌కు సన్మానం

బషీరాబాద్: శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను బషీరాబాద్ ఎంపీపీ కరుణ, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.



స్పీకర్, ఎమ్మెల్యేలను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

జిల్లాకు కృషి విజ్ఞాన కేంద్రం

50 ఎకరాలు కేటాయించాలని కలెక్టర్‌కు వినతి

వికారాబాద్ అర్బన్: జిల్లాలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు (కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయానికి) 50 ఎకరాల ప్రభుత్వ భూమిని ఉచితంగా కేటాయించాలని హైదరాబాద్ రాజేంద్రనగర్ హార్టీకల్చర్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చీనా నాయక్, డైరెక్టర్ డాక్టర్ కిరణ్‌కుమార్ కలెక్టర్ సి.నారాయణరెడ్డిని కోరారు. గురువారం ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రానికి 15 కృషి విజ్ఞాన కేంద్రాలు మంజూరైనట్లు తెలిపారు. ఇందులో వికారాబాద్ కూడా ఉందని వివరించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, కొడంగల్ నియోజకవర్గంలో భూమిని కేటాయించనున్నట్లు తెలిపినట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న అధికారులు



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

ప్రతి ఎకరాకు సాగునీరందిస్తాం

- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

దోమ: పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం దోమ మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఆరు గ్యారంటీల అమలు, అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పరిగి నియోజకవర్గ రూపురేఖలు మార్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో చర్చించామన్నారు. వికారాబాద్, పరిగి మీదుగా కృష్ణ కొత్త రైల్వే లైన్ పనుల కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. 122 కిలో మీటర్ల రైల్వే లైన్ కోసం సుమారు రూ. 2,196 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. ఈ పనులు పూర్తయితే వికారాబాద్, నస్కల్, పరిగి, దోమ, దాదాపూర్, కోస్గి, కొడంగల్ ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పూడూరు మండలంలో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని వివరించారు. ఫిబ్రవరిలో ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. నేవీ రాడార్ స్టేషన్ పనులు పూర్తయితే జిల్లాలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. దోమ మండలం నా పుట్టిల్లు లాంటిదన్నారు. అభివృద్ధిలో ఈ ప్రాంతాన్ని జిల్లాలోనే అగ్రగామిగా నిలుపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీపీ అనసూయ, ఎంపీడీఓ జయరాం, ఆర్‌ఐలు శివప్రసాద్, సుదర్శన్, బాస్‌పల్లి మాజీ సర్పంచ్ అనంతయ్య, కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

'లైన్' క్లియర్..!

- వికారాబాద్ – కృష్ణ రైల్వే లైన్‌కు త్వరలో మోక్షం
- రాష్ట్ర వాటా ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధం
- సర్వేకు ప్రత్యేక నిధుల కేటాయింపు
- రైల్వే లైన్‌లో మార్పులు జరిగే అవకాశం ?
- పరిగి ప్రజల్లో చిగురించిన ఆశలు
- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కృషిపై ప్రశంసలు

పరిగి: వికారాబాద్ – కృష్ణ రైల్వే లైన్‌కు త్వరలో మోక్షం లభించనుంది. దీంతో పరిగి నియోజకవర్గ ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టు పనులు త్వరలో పట్టాలెక్కనున్నట్లు సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డి వికారాబాద్ జిల్లాపై ప్రత్యేక దృష్టి సారిస్తుండటం, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి రైల్వే ప్రాజెక్టు గురించి సీఎంకి వివరించడం ఆయన ఓకే చెప్పినట్లు సమాచారం. ఈ ప్రాజెక్టుకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. గతంలో వికారాబాద్ నుంచి కృష్ణ వరకు 87 కిలో మీటర్ల మేర రైల్వే లైన్ కోసం రూ.90 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. ఈ పనుల కోసం సర్వే చేసినా కాగితాలకే పరిమితమయ్యాయి. వికారాబాద్ నుంచి పరిగి, కోస్గి, మద్దూర్, ఊట్కూర్, నారాయణపేట మీదుగా కృష్ణా రైల్వే స్టేషన్ వరకు లైన్ ఏర్పాటుకు సర్వే చేశారు. ఈ ప్రాజెక్టు మంజూరు కావాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 శాతం నిష్పత్తిలో నిధులు కేటాయించాలి. ఇన్నాళ్లు గత ప్రభుత్వం తన వాటా నిధులపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో ప్రాజెక్టు ముందుకు సాగలేదు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైల్వే లైన్ పనుల అనుమతుల కోసం కసరత్తు ప్రారంభించింది.

రైల్వే మార్గం మారే అవకాశం

గతంలో వికారాబాద్ నుంచి పరిగి, దోమ, కోస్గి, నారాయణపేట్ మీదుగా కృష్ణ వరకు సర్వే పనులను చేశారు. గతంలో నిర్ధారించిన మార్గంలో కాకుండా ఆకృతిలో మార్పులు జరిగే అవకాశాలు ఉన్నాయి. వికారాబాద్ నుంచి కొడంగల్, దౌల్తాబాద్ ప్రాంతాలను కలిపే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. పాత రైల్వే లైన్ ప్రకారం పట్టణాల మీదుగా లైన్ వెళితే పెద్ద ఎత్తున భూ సేకరణ చేయాల్సి ఉంటుంది. దీంతో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం లేకపోలేదు. దీంతో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రైల్వే లైన్ పనులు జరిగేలా రీ సర్వే చేయాలని ప్రభుత్వం భావించింది. త్వరలోనే సార్వత్రిక ఎన్నికలు వచ్చే అవకాశ ఉంది. ఆ లోగా కేంద్రం పూర్తి స్థాయిలో బడ్జెట్ ప్రవేశ పెడితే వికారాబాద్ – కృష్ణ లైను గురించి కేంద్ర ప్రస్తావించే అవకాశం ఉంది.

రీ సర్వేకు నిధులు

ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వికారాబాద్ – కృష్ణ రైల్వే లైన్ కోసం సర్వే చేశారు. నిధులు కేటాయించక పోవడం, భూ సేకరణ పనులు చేపట్టకపోవడంతో తదుపరి పనులు సాగలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైల్వే లైన్ పనులు ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి వికారాబాద్ – కృష్ణ రైల్వే లైన్ కోసం గట్టి ప్రయత్నం చేసి సీఎంను ఒప్పించినట్లు తెలిసింది. గతంలో చేసిన సర్వే కాకుండా రీ సర్వే కోసం ప్రభుత్వం రూ.18 కోట్లు మంజూరు చేసినట్లు తెలుస్తోంది. త్వరలో ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభం కానున్నాయి.

నెరవేరనున్న పరిగి ప్రజల కళ

పరిగి మీదుగా రైల్వే లైన్ కోసం ఈ ప్రాంత ప్రజల దశాబ్దకాలంగా ఎదురు చూస్తున్నారు. త్వరలో రైలు మార్గం ఏర్పాటు కానుండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రైల్వే సేవలు అందుబాటులోకి వస్తే రైతులు, ఉద్యోగులు, వ్యాపారులకు మేలు జరుగుతుంది.



వికారాబాద్ రైల్వేస్టేషన్

త్వరలోనే పనులు



ప్రభుత్వం రైల్వే లైన్ రీ సర్వే కోసం రూ.18 కోట్లు కేటాయించింది. త్వరలో ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభమవుతాయి. గతంలో మా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రైల్వే లైన్ కోసం నిధులు తెచ్చా. గత ప్రభుత్వం పట్టించుకోలేదు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తే వెంటనే రైల్వే అధికారులతో మాట్లాడి పనులను ప్రారంభించాలని ఆదేశించారు.

– రామ్మోహన్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే

క్లుప్తంగా

నేడు ఎన్డీఆర్‌ఎఫ్‌ మాక్‌ డ్రిల్‌

తాండూరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాల మైదానంలో శుక్రవారం ఎన్డీఆర్‌ఎఫ్‌ మాక్‌ డ్రిల్‌ ఉంటుందని ఆర్డీఓ శ్రీనివాస్‌రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మాక్‌డ్రిల్‌కు అటవీ శాఖ, వైద్య శాఖ, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది హాజరవ్వాలని చెప్పారు.

'మోడల్‌'లో ప్రవేశాలకు దరఖాస్తులు

తాండూరు రూరల్‌: మండల పరిధిలోని ఐనెల్లి శివారులో ఉన్న తెలంగాణ మోడల్‌ స్కూల్లో ఆరవ తరగతి ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్‌ ప్రకాశ్‌గౌడ్‌ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 సంవత్సరంలో ఆరో తరగతిలో చేరేందుకుగాను ఫిబ్రవరి 22వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ బీసీ విద్యార్థులు రూ.125, ఓసీ విద్యార్థులు రూ.200 పరీక్ష ఫీజ చెల్లించాలన్నారు. ఏప్రిల్‌ 7న ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు. ఏడు నుంచి 10 తరగతి వరకు ఖాళీ సీట్లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఏప్రిల్‌ 7న ప్రవేశ పరీక్ష

మర్పల్లి: మర్పల్లి మోడల్‌ స్కూల్‌లో ఆరోతరగతిలో అడ్మిషన్‌ పొందేందుకు విద్యార్థులకు ప్రవేశపరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కృష్ణకుమార్‌ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 7వ తరగతి నుంచి 10వరకు మిగిలిన సీట్ల భర్తీ సైతం ఈ నెల 12 నుంచి 22వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు. ఏప్రిల్‌ 7న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

బీఆర్‌ఏఓయూలో అడ్మిషన్లు ప్రారంభం

కొడంగల్‌ రూరల్‌: డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ ఓపెన్‌ వర్సిటీలో డిగ్రీ మొదటి, ద్వితీయ, తృతీయ సంవత్సరంలో అడ్మిషన్స్‌ కోసం నోటిఫికేషన్‌ విడుదలైందని పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోఆర్డినేటర్‌ ప్రొఫెసర్‌ జె.రాజారాం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 31వరకు ఈ స్పెషల్‌ డ్రైవ్‌ ఉంటుందని ఆయన చెప్పారు.

రైతులకు దీర్ఘకాలిక రుణాల పంపిణీ

శంషాబాద్‌ రూరల్‌: మండలంలోని మల్కారం సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు రుణాలను అందజేశారు. నాబార్డు నుంచి రూ.కోటి 43 లక్షల దీర్ఘకాలిక రుణాలను గురువారం చైర్మన్‌ బి.సతీష్‌ పంపిణీ చేశారు. తీసుకున్న పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలను వాయిదా ప్రకారం చెల్లించి సంఘం అభివృద్ధికి తోడ్పాడలన్నారు.

రౌడీ షీటర్‌ దారుణ హత్య

- మాట్లాడుకుందామని పిలిచి కత్తులతో దాడి
- మర్మాంగాలు కోసిన ప్రత్యర్థులు
- 23 కేసుల్లో నిందితుడిగా ఉన్న హతుడు



ముబీన్‌(ఫైల్‌)

పహాడీషరీఫ్‌: రౌడీ షీటర్‌ దారుణ హత్యకు గురైన సంఘటన బాలాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట అబూబకర్‌ కాలనీకి చెందిన మహ్మద్‌ ముబారక్‌ సిగర్‌ అలియాస్‌ ముబీన్‌(33) బాలాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో రౌడీషీటర్‌గా నమోదై ఉన్నాడు. యుక్త వయసు నుంచే నేరబాట పట్టిన ఇతనిపై ఇప్పటి వరకు 23 కేసులు నమోదయ్యాయి. ఇందుల్లో మూడు హత్య(పహాడీషరీఫ్‌ (2010లో), రాజేంద్రనగర్‌, బండ్లగూడ ఠాణాల పరిధి), మూడు హత్యాయత్నం, ఏడు చోరీ, మూడు ఆయుధ దుర్వినియోగం, రెండు కిడ్నాప్‌, ఐదు గొడవలకు సంబంధించిన కేసులున్నాయి. ఎవరిని పడితే వారిని బెదిరించడం.. నగదు, బైక్‌లు, సెల్‌ఫోన్లు లాక్కోవడం వంటివి చేస్తుంటాడు. ఎర్రకుంటలో గత నెల 8న పదిహేడేళ్ల బాలుడిని కిడ్నాప్‌ చేయడంతో బాలాపూర్‌ పోలీసులు అతన్ని రిమాండ్‌కు తరలించారు. కొద్ది రోజులకే జైలు నుంచి వచ్చిన ముబారక్‌ ఫలక్‌నుమా పీఎస్‌ పరిధిలో అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో అక్కడి పోలీసులు అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు పంపించారు. ఆరు రోజుల అనంతరం జైలు నుంచి విడుదలయ్యాడు. పోలీస్‌ స్టేషన్‌కే తలనొప్పిగా మారిన ఇతడు చట్టాల్లోని లొసుగులతో తరచూ బెయిల్‌పై విడుదలై నేర ప్రవృత్తిని కొనసాగిస్తూ వస్తున్నాడు. ఇదిలా ఉండగా రాజేంద్రనగర్‌, లంగర్‌హౌస్‌ ప్రాంతాలకు చెందిన ఇద్దరు రౌడీ షీటర్లతో ఇతనికి పాత గొడవలున్నాయి. రౌడీషీటర్లతో పాటు వారి అనుచరులకు సంబంధించి గతంలో బైక్‌లు, సెల్‌ఫోన్లు, కొంత నగదు కూడా తీసుకున్నాడు. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య పరిచయస్తులు మాట్లాడుకుందామంటూ ముబారక్‌ను బుధవారం అర్ధరాత్రి వాదే ముస్తఫాలోని మదీనా మజీద్‌ ప్రాంతానికి పిలిపించారు. అక్కడికి చేరుకున్నాక మాట్లాడుకునే క్రమంలో మాటామాటా పెరిగింది. దీంతో ఆగ్రహానికి గురైన ప్రత్యర్థి వర్గం ముబారక్‌పై కత్తులు, కర్రలతో విచక్షణా రహితంగా దాడికి పాల్పడింది. అంతటితో ఆగకుండా అతని మర్మంగాలను కూడా కోసేశారు. దీంతో ముబారక్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వెంటనే మహేశ్వరం డీసీపీ డి.సునితారెడ్డి, అదనపు డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ శ్రీనివాస్‌ యాదవ్‌, బాలాపూర్‌ ఇన్‌స్పెక్టర్‌ బి.వెంకట్‌రెడ్డి, అదనపు ఇన్‌స్పెక్టర్‌ మధు ఘటనా స్థలానికి చేరుకొని హత్య జరిగిన తీరును పరిశీలించారు. ఘటనా స్థలంలో కర్రలు, పగిలిన మద్యం బాటిళ్లు పడి ఉన్నాయి. వెంటనే డాగ్‌ స్క్వాడ్‌ను రప్పించి నిందితుల కోసం గాలించారు. క్లూస్‌ టీం ఆధారాలు సేకరించారు. హత్య చేసిన వారిలో ఆదిల్‌, అమీర్‌, హుస్సేన్‌లతో పాటు మరికొందరు ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివాహేతర సంబంధాలు ఏవైనా ఉన్నాయా..? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. దీనికి తోడు హతుడికి హోమో సెక్స్‌వల్స్‌తోనూ సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ముబీన్‌కు గతంలో వివాహం జరగగా ఇతడి ప్రవర్తనకు విసిగిపోయిన భార్య వదిలివెళ్లిపోయింది.


మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగురవేస్తాం

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

అనంతగిరి: వచ్చే లోక్‌ సభ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగుర వేస్తామని మాజీ ఎంపీ, పార్టీ రాష్ట్ర నాయకుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన వికారాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డితో కలిసి మాట్లాడారు. ప్రపంచంలో పదో స్థానంలో ఉన్న భారతదేశం మోదీ పాలనతో ఐదో స్థానానికి ఎదిగిందన్నారు. రానున్న రోజుల్లో తృతీయ స్థానానికి తీసుకువచ్చేందుకు పార్టీ పనిచేస్తోందన్నారు. దేశంలోని 7లక్షల గ్రామాలకు కేంద్రప్రభుత్వ పథకాలను పరిచయం చేసేందుకే వికసిత్‌ భారత్‌ కార్యక్రమం చేపట్టామన్నారు. మోదీ పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. చేవెళ్ల బీజేపీ టికెట్‌ తనకే వస్తుందని ప్రజలు ఎక్కడికి వెళ్లినా బీజేపీ గెలుపునకు శ్రమిస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వం కేంద్రంతో సఖ్యతగా లేదని.. ఈ ప్రభుత్వమైనా అభివృద్ధి విషయంలో కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగించి అభివృద్ధి పనులు చేయించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో పదికి పైగా స్థానాల్లో కాషాయ జెండా ఎగరడం ఖాయమన్నారు. నేను కాంగ్రెస్‌ పార్టీలోకి వెళ్తున్నాననే మాటలు అవాస్తవమని కొట్టి పారేశారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో బీజేపీ ఓటు బ్యాంకు మూడింతలు పెరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలంగా ఉందని, శక్తి కేంద్రాలు, బూత్‌లు బలంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్‌, అసెంబ్లీ ఇన్‌చార్జి శ్రీధర్‌రెడ్డి, సీనియర్‌ నాయకులు నరోత్తంరెడ్డి, పరమేశ్వర్‌, మాధవి, రఘు పాల్గొన్నారు.

రెండు మంత్రి పదవులు కేటాయించాలి

ఎమ్మార్పీఎస్‌ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్‌ మాదిగ


విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్‌ నాయకులు

యాలాల: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో మాదిగ ప్రజాప్రతినిధులకు సముచిత స్థానం కల్పించి రెండు మంత్రి పదవులను కేటాయించాలని ఎమ్మార్పీఎస్‌ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్‌ మాదిగ డిమాండ్‌ చేశారు. గురువారం ఆయన మండల కేంద్రంలో ఎంఆర్‌పీఎస్‌ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కొత్త ప్రభుత్వంలో మంత్రి పదవులతో పాటు తెలంగాణలో అతిపెద్ద జనభా కలిగిన మాదిగలకు ఎమ్మెల్సీ, నామినేటెడ్‌ పోస్టులు ఇవ్వాలని కోరారు. ఈ నెల 17న ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు ఇవ్వనున్న తీర్పుతో న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం దేవనూరు కమిటీ అధ్యక్షుడు సూర్యప్రకాశ్‌, నాయకులు కృష్ణ, మహేందర్‌, వెంకటేశ్‌, శ్రీశైలం, నవీన్‌, నరేందర్‌, నరేశ్‌, శ్రావణ్‌, భరత్‌ తదితరులున్నారు.

శుభాకాంక్షల వెల్లువ

ఘనంగా జెడ్పీ చైర్‌పర్సన్‌ అనితారెడ్డి జన్మదిన వేడుకలు

మహేశ్వరం: మహేశ్వరం మండల ప్రజల ఆశీస్సులతోనే తాను జెడ్పీటీసీ సభ్యురాలిగా గెలుపొంది, జిల్లా పరిషత్‌ చైర్‌పర్సన్‌ అయ్యానని తీగల అనితారెడ్డి అన్నారు. ఘట్టుపల్లి శివారులోని కొరుపోలు చంద్రారెడ్డి (కేసీఆర్‌) గార్డెన్‌లో గురువారం ఆమె జన్మదిన వేడుకలు నిర్వహించారు. చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, మహేశ్వరం, రాజేంద్రనగర్‌, చేవెళ్ల ఎమ్మెల్యేలు సబితారెడ్డి, ప్రకాశ్‌గౌడ్‌, కాలె యాదయ్య, ఎమ్మెల్సీ దయానంద్‌ గుప్తా, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో పాటు పలువురు జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, బీఆర్‌ఎస్‌ నాయకులు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్‌ మండల ప్రధాన కార్యదర్శి మర్యాద రాఘవేందర్‌రెడ్డి, మన్సాన్‌పల్లి బీఆర్‌ఎస్‌ నాయకులు అనితారెడ్డి భారీ ఫొటో ఫ్రేమ్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా అనితారెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్‌, కేటీఆర్‌, సబితమ్మ సహకారంతోనే తాను ఈస్థాయికి ఎదిగానన్నారు. మహేశ్వరం తనకు పుట్టినిల్లని, ఈ ప్రాంత అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని తెలిపారు.

వివేకానందుడి బోధనలు అనుసరణీయం

వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్‌ సుధాకర్‌


విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న డాక్టర్‌ సుధాకర్‌, సమితి సభ్యులు

తాండూరు టౌన్‌: దేశ ప్రయోజనాల కోసం యువత కృషి చేయాలని తాండూరు వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్‌ సుధాకర్‌ అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని శ్రీరామకృష్ణ సేవా సమితి తాండూరు శాఖ వారు నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు గురువారం బహుమలు ప్రదానం చేశారు. స్థానిక విశ్వవేద పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల, కళాశాలల వ్యాసరచన, ఉపన్యాస, పోటీల్లో గెలుపొందిన 72 మంది విజేతలకు జ్ఞాపిక, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్‌ సుధాకర్‌ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే యువతలో మార్పు రావాలన్నారు. స్వప్రయోజనాల కోసం కాకుండా దేశ ప్రయోజనాల కోసం పాటుపడాలన్నారు. ఏకాగ్రతతో చదివి, వివిధ రంగాల్లో నైపుణ్యాన్ని సాధించాలన్నారు. బలమే జీవనం, బలహీనతే మరణమని స్వామి వివేకానంద చెప్పిన స్ఫూర్తిదాయక వచనాలను తరచూ గుర్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం శ్రీరామకృష్ణ సేవా సమితి తాండూరు అధ్యక్షుడు బాలకృష్ణ మాట్లాడుతూ.. భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి చేరుకోవాలంటే మార్కులు మాత్రమే అవసరమనే ధోరణిని తల్లిదండ్రులు, విద్యార్థులు మార్చుకోవాలన్నారు. వివేకానందుని ఆశయాలను అనుసరిస్తూ ఉన్నత భావాలను పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానందుడి వేషధారణలో చిన్నారులు అలరించారు. శ్రీరామకృష్ణ సేవా సమితి తాండూరు అధ్యక్షుడు బాలకృష్ణ, సభ్యులు గాజుల బస్వరాజ్‌, శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకట్‌, వెంకటేశ్‌, గణేశ్‌, సుజాత, మల్లేశం, చంద్రకాంత్‌రెడ్డి, వెంకటయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

ఆరు సెల్‌ఫోన్‌లు, నగదు స్వాధీనం

మీర్‌పేట: పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మీర్‌పేట పీఎస్‌ ఎస్‌ఐ బద్యా నాయక్‌ ప్రకారం.. నందిహిల్స్‌ రోడ్‌ నెం–3లో నగేష్‌యాదవ్‌, రామచందర్‌, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్‌ సాగర్‌, కృష్ణయ్యలు బుధవారం అర్ధరాత్రి ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు దాడి చేసి పేకాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.15,080 నగదు, ఆరు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

సమస్యల పరిష్కారానికి నేనే వస్తా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌ రెడ్డి

- ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నాం
- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కుల్కచర్ల: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల సమస్యలపై తనకు అవగాహన ఉందని.. వాటి పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని బండవెల్కిచర్లలో జిల్లా స్థాయి వాలీబాల్‌ టోర్నీ ప్రారంభోత్సవానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయిలో అన్ని శాఖలు తమ విధుల నిర్వహణకు అవసరమైన కార్యవర్గాన్ని రూపొందించుకుంటున్నాయని.. ఇప్పుడే తొందరపడవద్దని సూచించారు. చిన్న చిన్న పనులకు తొందరపడి ఫైల్స్‌ తీసుకురావద్దని.. కొందరు పనిగట్టుకుని ఫోన్లు చేయిస్తున్నారని అది సరికాదన్నారు. గ్రామాల వారీగా అవసరాలను గుర్తించి ఒక్కొక్కటిగా పనులను పూర్తి చేసుకుందామన్నారు. 15 రోజుల పాటు ఏవైనా సమస్యలుంటే మండల స్థాయి నాయకుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం వాల్‌బాల్‌ పోటీలను ప్రారంభించారు. యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, ఎంఈఓ హబీబ్‌ అహ్మద్‌, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, బ్లాక్‌ బి అధ్యక్షుడు భరత్‌కుమార్‌, పార్టీ ప్రధాన కార్యదర్శి గోపాల్‌ నాయక్‌, మాజీ పాంబండ చైర్మన్‌ బాల్‌ రెడ్డి, నాయకులు వెంకటయ్య, స్వామి, పీడీ ఖాజ నిర్వాహకులు గోవర్ధన్‌ రెడ్డి, ఆర్మీ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌ అదుపుతప్పి..

అన్నదమ్ములకు తీవ్ర గాయాలు

యాచారం: రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు తీవ్రంగా గాయడపడ్డారు. యాచారం పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని నందివనపర్తి గ్రామానికి చెందిన మల్లెపల్లి ప్రభాకర్‌, ఈశ్వర్‌ గురువారం ఉదయం బైక్‌పై మాల్‌మార్కెట్‌కు వచ్చారు. పనులు ముగించుకుని తిరుగుప్రయాణం అయ్యారు. ఈ క్రమంలో సాగర్‌రోడ్డుపై చింతపట్ల గేట్‌ వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోగా బైక్‌ అదుపుతప్పి కిందపడిపోయారు. తీవ్ర గాయాలైన క్షతగాత్రులున 108 అంబులెన్స్‌లో నగరంలోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు.

తప్పిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యుల చెంతకు..



దస్తగిరిని కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

పరిగి: పరిగిలో ఈనెల 6నుంచి 8 వరకు నిర్వహించిన ఇస్తేమా సభలకు హాజరై తప్పిపోయిన ఓ వ్యక్తి కుటుంబ సభ్యుల చెంతకు చేరాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. జిగిత్యాల జిల్లా రాయికల్‌ నుంచి పరిగి వచ్చిన దస్తగిరి కార్యక్రమంలో పాల్గొన్నాడు. వేడుకలకు లక్షలాది మంది జనం రావడంతో మతిస్థిమితం కోల్పోయినట్లయ్యాడు. ఇతను ఇంటికి చేరలేదని తెలుసుకున్న యూత్‌ కాంగ్రెస్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగవర్ధన్‌ సోషల్‌ మీడియా ద్వారా పోస్టులు పెట్టడంతో బుధవారం పట్టణ కేంద్రంలోని తిరుమల వెంచర్‌లో అనుమానాస్పదంగా తీరుగుతున్న వ్యక్తిని గమనించిన స్థానికులు.. సోషల్‌ మీడియాలోని ఫొటోలు చూసి దస్తగిరిగా గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అతను ఉన్న స్థలానికి చేరుకున్న పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించి దస్తగిరికి వారికి అప్పగించారు.

గ్యాస్‌ రీఫిల్లింగ్‌ చేస్తున్న ఇద్దరిపై కేసు

నందిగామ: అక్రమంగా గ్యాస్‌ రీఫిల్లింగ్‌ చేస్తున్న దుకాణాలపై గురువారం పోలీసులు దాడి చేసి తొమ్మిది సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ గోపాల కృష్ణ తెలిపిన ప్రకారం మండల కేంద్రం శివారులోని పృథ్వీ కాలనీలో అన్నారం సిద్దులు, మహ్మద్‌ జమునుద్దీన్‌ కిరాణ షాపులు నడుపుతున్నారు. వీరు సబ్సిడీపై పెద్ద సిలిండర్లను కొనుగోలు చేసి వాటిని చిన్న సిలిండర్లలో అక్రమంగా రీఫిల్లింగ్‌ చేస్తున్నారు. శంషాబాద్‌ డీసీపీ నారాయణరెడ్డి, స్థానిక సీఐ ప్రసాద్‌ ఆదేశానుసారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ రెండు కిరాణాల్లో తొమ్మిది సిలిండర్లను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోపాలకృష్ణ చెప్పారు.

ట్రాక్టర్‌ బ్యాటరీ ఎత్తుకెళ్లిన దుండగులు

దోమ: ట్రాక్టర్‌ను ధ్వసం చేసి బ్యాటరీ ఎత్తుకెళ్లిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లికి చెందిన రైతు రఘురాం పొలం పనుల కోసం ట్రాక్టర్‌ను కొనుగోలు చేశాడు. బుధవారం పనులు ముగించుకుని ఇంటికి వచ్చాడు. గురువారం వెళ్లి చూసే వరకు గుర్తు తెలియని దుండగులు ట్రాక్టర్‌ను ధ్వంసం చేసి బ్యాటరీని ఎత్తెకెళ్లారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

విద్యార్థులు, ఉపాధ్యాయుడికి సన్మానం


విద్యార్థులు, ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న హెచ్‌ఎం రేణుక

మొయినాబాద్‌రూరల్‌: జిల్లాస్థాయి సైన్స్‌ ఫెయిర్‌లో అమ్డాపూర్‌ జెడ్పీహెచ్‌ఎస్‌కు మొదటి స్థానం రావడం ఆనందంగా ఉందని హెచ్‌ఎం రేణుక అన్నారు. ఈ మేరకు గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులను సన్మానించి అభినందించారు. ఉపాధ్యాయుడు నగేశ్‌బాబు నేటికీ ఒక్క సెలవు తీసుకోకపోవడంతో ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రేణుక మాట్లాడుతూ.. పాఠశాలలో పని చేస్తున్న ఎస్‌ఏ ఫిజికల్‌ ఉపాధ్యాయుడు నగేశ్‌బాబు విద్యార్థులకు పాఠాలు బోధించడంలో ఎంతో ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. వారి శ్రమ వల్లే జిల్లా స్థాయిలో మొదటిస్థానం దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, స్వరూప, మంజుల, సంజీవ్‌కుమార్‌, సంగీత, అరుణ, సత్యనారాయణ, అబ్దుల్‌ ఖాదర్‌, గ్రామ ప్రజా ప్రతినిధులు, గోపికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి ముఠా గుట్టురట్టు


పోలీసుల అదుపులో నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయి

- ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల తనిఖీ
- ఎనిమిది మంది అరెస్టు
- రూ.7లక్షల విలువ చేసే 24 కిలోల గంజాయి స్వాధీనం

అబ్దుల్లాపూర్‌మెట్‌: ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు వచ్చే బస్సుల్లో అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఎనిమిది మంది ముఠా సభ్యులను ఎక్సైజ్‌ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద రూ.7లక్షల విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన గురువారం అబ్దుల్లాపూర్‌ మెట్‌ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. హయత్‌నగర్‌ ఎక్సైజ్‌ సీఐ లక్ష్మణ్‌గౌడ్‌ తెలిపిన ప్రకారం.. ఎక్సైజ్‌ ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఆ శాఖ అధికారులు తెల్లవారుజామున అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఫిల్మ్‌సిటీ గేట్‌ ఎదుట ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల తనిఖీలు చేపట్టారు. జిల్లా డిప్యూటీ కమిషనర్‌ డేవిడ్‌ రవికాంత్‌ ఆధ్వర్యంలో సరూర్‌నగర్‌ ఎక్సైజ్‌ సూపరిండెంట్‌ రవీందర్‌రావు, హనుమంతరావు నేతృత్వంలో ఆంధ్రా, ఒడిశా, చత్తీస్‌గఢ్‌ రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేశారు. ఈ సమయంలో ఎనిమిది మంది ప్రయాణికుల నుంచి 24 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.7 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. ఏపీలోని విశాఖ జిల్లా, పలాస, రాజమండ్రి, నర్సీపట్నం, అరకు, ఒడిశాలోని మల్కన్‌ గిరి నుంచి ఢిల్లీ, మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ ప్రాంతాలకు గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు పట్టుబడిన యువకులు తమ విచారణలో వెల్లడించారన్నారు. గంజాయిని సరఫరా చేస్తే ఒక్కొక్కరికి రూ.10 వేలు కమీషన్‌ ఇస్తామని చెప్పడంతోనే ఇలా చేస్తున్నామని పట్టుబడిన యువకులు తెలిపారన్నారు. ఈ దాడుల్లో సరూర్‌నగర్‌ డీటీఎఫ్‌ సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐలు వెంకన్న, జి.హనుమంతు, జి.సరళ, ఎండీ పాషా, హనుమంతు సరూర్‌ నగర్‌ డివిజన్‌ పరిధిలోని సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్‌ విక్రేతలను శిక్షిస్తాం

షాద్‌నగర్‌ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్‌

కొత్తూరు: మాదకద్రవ్యాల విక్రయాలను పూర్తిగా నిర్మూలించేందుకు పోలీసులకు పూర్తిస్వేచ్ఛ కల్పిస్తున్నట్లు షాద్‌నగర్‌ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో గంజాయి చాక్లెట్లు తిన్న విద్యార్థులు అనారోగ్యానికి గురైనట్లు వార్తలు రావడంతో ఆయన గురువారం పాఠశాలను సందర్శించారు. శంషాబాద్‌ ఏసీపీ రాంచందర్‌రావు, డీఈఓ సుశీందర్‌రావు, డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి, హెచ్‌ఎం అంగోర్‌నాయక్‌ను అడిగి ఘటన వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థులతో ఉపాధ్యాయులు స్నేహపూర్వక బంధాలను కొనసాగించాలన్నారు. చదువుతో పాటు మానసిక రుగ్మతలు, ఆరోగ్య అలవాట్లపై తరచుగా అవగాహన కల్పించాలని సూచించారు. నియోజకవర్గంలో గంజాయి, నిషేధిత మత్తు పదార్థాల విక్రయాలపై నిఘా పెట్టాలన్నారు. వీటిని విక్రయించినా, కొనుగోలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. కొత్తూరులో విద్యార్థులకు గంజా యి చాక్లెట్లు విక్రయించిన ముగ్గురు నిందితులను ఇప్పటికే అరెస్ట్‌ చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ కేసుకు సంబంధం ఉన్న మిగిలిన దుండగులను పోలీసులు మూడు రోజుల్లో పట్టుకుంటారని ఎమ్మెల్యే మీడియాకు చెప్పారు.

కొనుగోలు చేసినా నేరస్తులే..

డ్రగ్స్‌కు అలవాటు పడితే అనారోగ్యాల బారిన పడి విలువైన జీవితాలను నాశనం చేసుకుంటారని వైద్య, విద్యాశాఖ అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. వీటిని కొనుగోలు చేసినా, సేవించిన వారు సైతం చట్టం పరిధిలో నేరస్తులుగా పరిగణింపబడతారని వివరించారు. విద్యార్థులు డ్రగ్స్‌ బారిన పడితే అనారోగ్యంతో పాటు చదువుపై సైత ం ఏకగ్రత కోల్పోతారని చెప్పారు. ఎక్కడైన మత్తు పదార్థాల విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే పోలీ సులకు, తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు సుదర్శన్‌గౌడ్‌, దేవేందర్‌ముదిరాజ్‌, హరినాథ్‌రెడ్డి, ఏబీవీపీ, బీజేపీ, బీఆర్‌ఎస్‌ నాయకులు పాల్గొన్నారు.